క్లుప్తంగా

హరిశ్చంద్ర నాటకాలపై 21న పుస్తకావిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూరిబాబు రాజు తదితరులు

పెద్దాపురం: ఈ నెల 21వ తేదీన 'హరిశ్చంద్ర నాటకాలు–తులనాత్మక పరిశీలన' తెలుగు పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. సాహితీ స్రవంతి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు రచించిన పుస్తకావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు రచనలు చాలా ఆదర్శప్రాయంగా, విప్లవాత్మకంగా ఉంటాయని సూరిబాబు రాజు అన్నారు. ఆయన వెలువరించిన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథావిష్కరణ సభకు కవులు, రచయితలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త శివ, కూనిరెడ్డి అరుణ, ఉదయ్, చర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్‌లో పూడికతీత



పూడికతీత అనంతరం శుభ్రంగా ఉన్న రహదారి

సాక్షి ఎఫెక్ట్

కొత్తపల్లి: వాకతిప్ప గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న వీధిలో డ్రైన్ పూడుకుపోవడంతో నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీనిపై సాక్షి దిన పత్రికలో సోమవారం జోరు వాన వాకతిప్పలో డ్రైన్ పూడుకుపోయి రోడ్డుపై నిలిచిన నీరు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఆ డ్రైన్‌లో పూడికను తీయించారు.

19 నుంచి గురు పౌర్ణమి ఉత్సవాలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో దత్తాత్రేయ, శిరిడీసాయి ఆలయంలో 19వ తేదీన గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.అప్పారావు, జి.సత్యనారాయణ తెలిపారు. 21వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలు అలంకరించారు. ముగింపు రోజున 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంలో అన్న సమారాధన ఉంటుందని వారు తెలిపారు.


ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా గంగబాబు



గంగబాబును అభినందిస్తున్న నాయకులు

పిఠాపురం: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చేట్ల గంగ బాబును నియమించినట్టు ఆ పార్టీ జిల్లా నాయకులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల రవికాంత్ కుమార్‌లను ఉత్తర్వులు మంగళవారం అందాయి. నియామకపత్రాన్ని జిల్లా నాయకుడు పలివెల శివమణి చేట్ల గంగబాబుకు అందజేశారు. పార్టీ నాయకుల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా మాదిగల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్



వినియోగంలో లేక తుప్పలతో నిండిన షెల్టర్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని వీకే రాయపురం వద్ద దాతలు ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉంది. గ్రామం నుంచి కాకినాడ వెళ్లే వారి కోసం ఏర్పాటు చేసిన ఈ షెల్టర్ వద్ద కాకుండా సమీపంలోని దుకాణాల వద్ద బస్సులను ఆపుతుండడంతో ప్రయాణికులు అక్కడే నిలబడాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఆ షెల్టర్‌ను ఎవరైనా ఆక్రమించే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. 1988లో వీర్రాజు, సూర్యకాంతం దంపతుల ఆధ్వర్యంలో ఈ షెల్టర్‌ను నిర్మించారు. దీనిని పునరుద్ధరించాలని పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరిని కోరారు. షెల్టర్ సమీపంలో శుభ్రం చేయించి ప్రయాణికులు వేచి ఉండేలా తీర్చిదిద్దుతామని, బస్సులు ఇక్కడ ఆపే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రవీంద్రపురం.. సమస్యల నిలయం

- రోడ్లపై చేరిన మురుగునీరు
- పూడుకుపోయిన పంట కాలువలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ఎంపీపీ పాఠశాల



రోడ్లపై పారుతున్న మురుగునీరు



తాగునీటి ట్యాంకు వద్ద పెరిగిపోయిన గడ్డి

కొత్తపల్లి: రవీంద్రపురంలో సమస్యలు తిష్టవేశాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. డ్రైన్లు చెత్తా చెదారంతో పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. డ్రైన్లలో నీరు పారక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దోమలతో రాత్రుళ్లు కంటి మీద నిద్రలేకుండపోతోంది. వీటివల్ల రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు మంచాన బారిన పడుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రోడ్లకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. చీకటి పడితే భయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.

పూడుకుపోయిన కాలువలు

వర్షపునీరు, ముంపునీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. పలు చోట్ల పూడికతో, తుప్పలతో పూడికపోవడంతో నీరు పోయేందుకు వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఈ కాలువల నుంచే ఎగువ నుంచి ముంపునీరు పోయేందుకు వీలులేకుండా ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలుషితమవుతున్న తాగునీరు

స్థానికంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగునీరు, తుప్పలు విపరీతంగా పేరుకుపోవడంతో తాగునీరు కలుషితమవుతోంది. ట్యాంకు చుట్టూరా మురుగునీరు, గడ్డితో పెరిగిపోయింది. వర్షం కాలం కావడంతో పరిశుభ్రత లేకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశముంది.

శిథిలావస్థలో పాఠశాల

స్థానికంగా ఉన్న ఎంపీపీ పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకంగా మారింది. మెర్జింగ్‌లో భాగంగా ఈ పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేశారు. దీంతో పాఠశాల ఉపయోగించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా చెట్లు కొమ్మలు విరిగి పాఠశాలపై పడడంతో ప్రమాదకంగా మారింది. ఈ పాఠశాలల ఏ సమయంలో కూలి పక్కనున్న ఇళ్లపై పడతాయోనని ఆందోళన చెందుతున్నారు.

అధికారులతో ఎన్నిసార్లు చెప్పినా..

గ్రామాంలో ఉన్న సమస్యలపై ఎన్నిసార్లు అధికారులతో చెప్పినా ఏమాత్రం పట్టించుకోవడంలేదు. డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ముక్కుమూసుకుని నడిచివెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఏనాడు కూడా పంచాయతీ అధికారులు గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలు పట్టించుకున్న దాఖలాలులేవు.

–సానా కృష్ణ రవీంద్రపురం

తుప్పలతో తిప్పలు

గ్రామంలో ఎక్కడ చూసినా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో విష సర్పాలు రోడ్లపై సంచరిస్తున్నాయి. దోమలు విజంభిస్తుండడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. గ్రామ సర్పంచు దృష్టికి సమస్యలను తీసుకువెళ్లినా ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ముంపునీరు వెళ్లే కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణలు తొలగించాలి.

–రొబ్బి నటరాజ్, రవీంద్రపురం

అధికారుల నిర్లక్ష్యంతో కుంటుపడిన అభివృద్ధి

గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగతాయారు

పిఠాపురం: అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడిందని అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎనుకోబడిన ప్రజాప్రతినిధులను అగౌరవపరచేలా వ్యవహరిస్తున్నారని ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్నారని గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు ఆరోపించారు. ఆమె మంగళవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. గత మూడేళ్లగా గొల్లప్రోలు నగర పంచాయతీ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానన్నారు. ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించానని ఆమె తెలిపారు. అయితే గత కొంత కాలంగా పరిపాలనా పరమైన అంశాలు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తన దృష్టికి రావడం లేదన్నారు. ఈ విషయాలు అధికారుల దృష్టికి వెళ్లడం వల్ల వారు ఆయా సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. దీంతో సమస్యలు మరింత జఠిలంగా మారుతున్నాయని తద్వారా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల ఎదురవుతున్న సమస్యలకు పూర్తి నైతిక బాధ్యత అధికారులే వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వైఎస్సార్ సీపీ నేత గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాండురంగని కల్యాణం



పాండురంగస్వామి వారు



సామర్లకోటలో పాండు రంగ స్వామి ఆలయం

సామర్లకోట: సుమారు 190 ఏళ్ల పురాతన పాండురంగ ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఆషాఢం తొలి ఏకాదశి నాడు రుక్మిణీ సమేత పాండురంగడి కల్యాణం నిర్వహిస్తారు. పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల కూడలిలో ఉన్న ఈ ఆలయం వద్ద ఈ సందర్భంగా తిరునాళ్లు నిర్వహిస్తున్నారు. సామర్లకోటకు చెందిన అయోధ్యల కాటయ్య నాయుడు తన పొలంలో దుక్కి దున్నుతున్న సమయంలో స్వామి, అమ్మవారి విగ్రహాలు లభ్యమవడంతో వారి సొంత స్థలంలోనే కల్యాణం నిర్వహిస్తుంటారు. వంశ పారంపర్యంగా అయోధ్యల రాజేశ్వరరావు ధర్మకర్తలుగా ఆలయ నిర్వాహణ చేస్తూ ఉత్సవాలకు భారీ విద్యుదలంకరణలు చేశారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచండి

- కమిషనర్ వెంకటరావు
- ఆయా స్థలాల యజమానులకు నగరపాలక సంస్థ నోటీసులు
- పూడిక తీత పనుల పరిశీలన



పూడికతీత పనులు, పారిశుద్ధ్య పనులపై సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: అపరిశుభ్రతకు, దోమల తీవ్రతకు కారణమవుతున్న ఖాళీ స్థలాల్లో నిలవ నీటిని వెంటనే తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు స్థల యజమానులను కోరారు. ఇందుకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలోని సుమారు 160 మంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. మంగళవారం ఆయన కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జరుగుతున్న పూడిక తీత పనులను పర్యవేక్షించారు. అక్కడి పనులు ప్రగతిని పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం జగన్నాథపురం రణదీప్‌నగర్ ప్రాంతంలోని మేజర్ డ్రైన్‌ను పరిశీలించారు. అక్కడ గుర్రపుడెక్క పేరుకు పోవడానికి గుర్తించారు. తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న తూరంగి గ్రామ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలవ ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి పరిశుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలను నిరుపయోగంగా, నిర్లక్ష్యంగా వదిలి పెట్టడం వల్ల పిచ్చి మొక్కలు పెరిగి, డంపింగ్ యార్డుల్లా తయారై, దోమలు పెరిగి ప్రజారోగ్యానికి భంగకరంగా మారుతున్నాయన్నారు. ఈ విషయమై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే పూడిక తీత పనులు పూర్తయిన అనంతరం అక్కడి వ్యర్థాలను కూడా తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

15 నుంచి అన్న క్యాంటీన్ల ప్రారంభం

వచ్చేనెల 15 నుంచి ఐదు ప్రాంతాల్లో అన్న క్యాంటిన్లను ప్రారంభించనున్నట్లు కమిషనర్ వెంకటరావు చెప్పారు. మంగళవారం ఆయన ఎస్ఈ పి.సత్యకుమారి ఇతర అధికారులతో కలిసి క్యాంటీన్లకు ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. జగన్నాథపురం, అన్నమ్మగాటి, సంతచెరువు, వివేకానంద పార్క్, డైరీఫారం సెంటర్ బోట్‌క్లబ్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే వాటి నిర్వహణకు టెండర్లు పిలిచామని, గురువారం నాటికి ఖరారు చేస్తామని తెలిపారు. కమిషనర్ వెంట స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

21లోగా ఫ్లెక్సీలు తొలగించాలి : కమిషనర్

కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు భానుగుడి పద్మప్రియ జంక్షన్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా నిర్ణయించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. గతంలో భానుగుడి నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా ప్రకటించి ఆచరణలో అమలులోకి తీసుకు వచ్చామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు గడువు విధించి అమలు చేశామన్నారు. తొలి విడత విజయవంతం కావడంతో రెండో విడత సంస్కరణలలో భాగంగా ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే పద్మప్రియ సెంటర్ నుంచి ఓవర్ బ్రిడ్జి, టూ టౌన్ పోలీస్ స్టేషన్, అపోలో హాస్పిటల్ మీదుగా సూపర్ బజార్, గ్లాస్‌హౌస్, గోల్డ్ మార్కెట్ సెంటర్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్‌గా నిర్ణయించామన్నారు. వాహన చోదకులు, పాదచారుల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయానికి అనుగుణంగా నిర్దేశించిన ఫ్లెక్సీ ఫ్రీ రోడ్ ప్రాంతంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను 21వ తేదీ ఆదివారం లోపుగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఈ నెల 22వ తేదీ నుంచి నగరపాలక సంస్థ తరఫున అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించి అందుకు అయ్యే ఖర్చును సంబంధిత వర్గాల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ కోసం తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధిత వర్గాలన్నీ సహకరించాలని కమిషనర్ కోరారు.

బాలలు, మహిళల చట్టాలపై అవగాహన



గొల్లప్రోలులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పిఠాపురం: ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం మహిళలు, బాలల చట్టాల గురించి భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఐసీడీఎస్ అధికారిని సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. గొల్లప్రోలులో మంగళవారం 100 రోజుల మిషన్ శక్తి అవగాహన కార్యక్రమంలో భాగంగా 5వ వారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం, మహిళలు, బాలల చట్టాల గురించి భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాల కోసం గర్భవతులకు, బాలింతలకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాలు వాటి వల్ల కలిగే ప్రయోజనాలనువివరించారు. ఈ కార్యక్రమం ఐసీడీఎస్ సిబ్బంది పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ మానసదేవి, నాగమణి, హెచ్‌వీ పి.లక్ష్మీరమణి, ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



పెద్దాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న పీడీ ప్రవీణ

పెద్దాపురం: బాలలు, మహిళల రక్షణకు చేసిన చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ నుంచి బాలల హక్కులు–చట్టాలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉష అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీడీ ప్రవీణ మాట్లాడుతూ కొత్త చట్టాలు, న్యాయ విధులపై ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలన్నారు. బాలలు, మహిళలపై దాడులు అరికట్టాలన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమా, చంద్రకళ, మంగ, బేబి, వెంకటలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి రోటరీ సేవలు అవసరం



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజ అవసరాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రోటరీ సంస్థకు మంచి గుర్తింపు వస్తుందని రోటరీ మాజీ గవర్నర్ ఎల్.సత్యనారాయణ (టిక్కు) అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శిగా దామెర శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక కాస్మాపాలిటిన్ క్లబ్‌లో మంగళవారం ఆయన మిత్ర బృందం సత్కరించారు. ఈ సందర్భంగ టిక్కు మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కలను నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాలిసిందిగా కోరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి



కొమరిగిరి లే అవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ

బోట్‌క్లబ్: కొమరిగిరి లే అవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు వీలైనంత త్వరగా గృహ నిర్మాణాలు ప్రారంభించాలని గృహ నిర్మాణశాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మంగళవారం కాకినాడ నగరంలోని వివిధ డివిజన్‌ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. స్థలాలు పొందిన వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు తమ వాట డబ్బులు చూసుకొని ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాల వద్ద మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గృహ నిర్మాణశాఖ ఈఈ వై.శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధే పరమావధి..

- సత్ఫలితాలు ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చర్యలు
- ఐటీఐలో నూరు శాతం అడ్మిషన్లు
- రూ.2.76 కోట్లతో సాంకేతిక పరికరాల ఆధునీకరణ




బాలాజీచెరువు: విద్యారంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే సాంకేతిక విద్యాభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంతవరకు ఏవో నచ్చిన కోర్సుల్లో చేరడం తరువాత ఏదో ఒక ఉపాధిని వెతుక్కుంటూ వెళ్లిపోవడం జరిగేది. నేటి పరిస్థితి అలా లేదు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులను అప్రెంటిస్‌గా తీసుకునేలా.. ఆయా సంస్థల్లో డిమాండ్ ఉన్న సాంకేతిక విద్యను అభ్యసించేలా విద్యార్థులకు అవగాహన కల్పించి తదనుగుణంగా ఉపాధికి మార్గాలు సుగమం చేశారు. ఆ చర్యల ఫలితంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ ఏడాది వంద సీట్లు భర్తీ అయ్యాయి. ఈ కళాశాలలో అడ్మిషన్లకు మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించి అన్ని కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. గత మూడేళ్ల కాలంలో 10 శాతం సీట్లు ఖాళీలు ఉండగా ఈ ఏడాది మాత్రం పూర్తిగా భర్తీ అయ్యాయి. ఇందుకు కారణం లేకపోలేదు. దానికి గల కారణం ఐటీఐలో ఆధునిక బోధనకు ఈ ఏడాది నుంచి చర్యలు తీసుకుంటున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వేల కొద్దీ హాజరవుతున్నా కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు సాధిస్తున్నారని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ స్వయంగా ప్రకటించింది. ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్ పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ హబ్‌ల వంటివి ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐ కళాశాల అభివృద్ధికి నిధులు విడుదల చేశాయి. దీంతో ఏన్నో ఏళ్లుగా నిధులు లేక నిర్వీర్యంగా ఉన్న ఈ కళాశాల ప్రస్తుత విద్యాబోధనకు అవసరమైన కొత్త పరికరాలు కొనుగోలుచేసి విద్యార్థులను అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఎప్పటి నుంచో ఉన్న పాత ప్రాక్టికల్ పరికరాలు స్థానంలో కొత్తవి కనుగోలు చేస్తున్నారు.

పదో తరగతి పూర్తి చేసిన తరువాత రెండేళ్ల కోర్సు చేస్తే పక్కా ఉపాధి కల్పించే దిశగా నేడు ప్రాచుర్యం పొందిన కోర్సు ఐటీఐ. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ) కోర్సులు ఉపాధి మార్గాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పలు ఉద్యోగ అవకాశాలు పొందేడానికి ఈ కోర్సులు దోహదపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే విద్యాసంస్థ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి ఉద్యోగం, ఉపాధి పొందడమే లక్ష్యంగా సాంకేతిక విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. కాకినాడ ఐటీఐలో అన్ని విభాగాల్లో కలిపి 1080 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

కాకినాడ ఐటీఐలో కోర్సులు ఇవే..

ఐటీఐ కళాశాలల్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, డీజిల్, మెకానికల్, వెల్డర్, డ్రాఫ్ట్‌స్‌మెన్(సివిల్), కోపా, ఆర్ అండ్‌ఏసీ, ట్రేడులు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో అభ్యర్థులు చేరితే శిక్షణ ముగిసాక ఏడాది పాటు అప్రెంటిస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజిల్ మెకానిక్, కోపా, వెల్డర్, ప్లంబర్ తదితర కోర్సులు ఏడాది కాలం కాగా, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులు రెండేళ్ల వ్యవధి కలిగినవి. అలాగే ఐటీఐ రెండేళ్లు పూర్తిచేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి అవకాశం ఉంటుంది.

వంద శాతం సీట్లు భర్తీ..



కాకినాడ ఐటీఐకు రూ.2.76 కోట్లు విడుదల చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2.47 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.29 లక్షలు. ఇప్పటికే మొదటి దశలో భాగంగా రూ.96 లక్షలు ఖాతాలో జమ చేశారు. మోటర్ మెకానిక్ విభాగానికి సంబందించి ఆధునీక పరికరాలు కోనుగోలు చేస్తాము. రెండో దశలో ఎలక్ట్రానిక్స్, డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్ విభాగాలు ఆధునీకరిస్తాం.

– ఎం.వేణుగోపాల వర్మ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు సూర్యుడు

ఏలేశ్వరం: యర్రవరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు మోటారుసైకిల్ వెళుతున్న వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. దీంతో పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు(70) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.